వేటకు సన్నద్ధం



బోటుకు సిగ్నల్ లైట్లు అమర్చుతున్న సిబ్బంది



వేటకు అవసరమైన సామగ్రి సిద్ధం చేస్తున్న మత్స్యకారులు



వేటకు సిద్ధంగా ఉన్న బోటు

రెండు నెలల విరామం తరువాత గంగపుత్రులు వేటకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు పూర్తిస్థాయిలో పడవలను, వలలను సిద్ధం చేసుకున్నారు. మత్స్యకార గ్రామాల్లో ఏటా జరిగే గ్రామ దేవతల జాతరలు కూడా పూర్తవుతుండడంతో బుధవారం నుంచి వేటకు బయల్దేరుతున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో సందడి వాతావరణం నెలకుంది. మరబోట్లు వేటకు సిద్ధమవుతున్నాయి. వేటకు అవసరమైన సరకులు సిద్ధం చేసుకుంటున్నారు. బోట్లు శుభ్రం చేసుకోవడం, నీరు నింపడం, విద్యుత్ సౌకర్యం, ఉప్పు బస్తాలు, ఐస్ నిల్వ చేసుకుంటున్నారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఉప్పు బస్తాలు అన్‌లోడింగ్ చేస్తున్న కార్మికులు



బోటును శుభ్రం చేస్తున్న మత్స్యకారుడు

క్లుప్తంగా

బాలరాజు ఇంటికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న బాలరాజు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం మాజీ మంత్రి బాలరాజు ఇంటికి వెళ్లారు. ఇటీవల జరిగిన బాలరాజు తనయుడి వివాహానికి ఆచప హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం విశాఖ వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి.. బీచ్ రోడ్డులోని వుడా పార్కు సమీపంలోని బాలరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన తనయుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, పలువురు కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు చేరువగా మంచి సినిమాలు



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు

సీతంపేట: మంచి సినిమాలను ప్రేక్షకులకు దగ్గర చేయడమే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం సొసైటీ గౌరవాధ్యక్షుడు ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు, ఎన్టీ రామారావు జయంతి నిర్వహణ, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యాలయం, సభ్యుల చేరిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, ఆర్.బాబ్జి పాల్గొన్నారు.

వాకర్ ఆకస్మిక మృతి



మృతి చెందిన బీఎస్ఎన్ రెడ్డి

మురళీనగర్: మురళీనగర్‌లో ఒక వాకర్ వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా మృతి చెందారు. వివరాలిలా.. ఈ ప్రాంతానికి చెందిన బీఎస్ఎన్ రెడ్డి (75) ప్రతి రోజు లాగానే ఆదివారం ఉదయం 5 గంటలకు వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. ఆయన వాకింగ్ ట్రాక్‌పై ఒక రౌండ్ నడిచిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంటుండగా కుప్పకూలిపోయారు. వాకర్స్ వచ్చి ఆయనకు సపర్యలు చేసి 108కు ఫోన్ చేసినప్పటికి అప్పటికే రెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. అతని మృత దేహాన్ని స్వగృహానికి తరలించారు. గుండె పోటుతో ఆయన మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు జీవిత కాలం సభ్యుడిగా బీఎస్ఎన్ రెడ్డి ఉన్నారు. ఆయన మరణంతో ఆదివారం పార్కును మూసివేశారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, సి.నాగ రాజు, కోశాధికారి మళ్ల రామకృష్ణ సంతాపం ప్రకటించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముడసర్లోవ సమీప స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 11వ వార్డు నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. ముందుగా ఇటీవల ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం గొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఇక్కడి ఆవరణలో బోరు తీయించే ఏర్పాటు చేస్తానన్నారు. నడక ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, పలువురు సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సభ్యులు పి.శంకరరావు, వై.బాలరాజు, మధుసూదనరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌కు అనాథ మహిళ తరలింపు



మహిళను నైట్ షెల్టర్‌కు తరలిస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో సంచరిస్తున్న అనాథ మహిళను నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నీల రెడ్డి ఇచ్చిన సమాచారంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి వెంటనే స్పందించారు. అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అనాథలు, బిచ్చగాళ్లు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే 77939 77705 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వారిని నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పిస్తామని జ్యోతిర్మయి తెలిపారు.

ఆగితే వెలగవు.. వెలిగితే ఆరవు!



12వ వార్డు సుందరయ్య కాలనీలో పగలు కూడా వెలుగుతున్న వీధి దీపం



రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దుర్గానగర్, నెహ్రూనగర్, లీలాసుందరినగర్, టీఐసీ పాయింట్, జ్యోతినగర్, తదితర కాలనీల్లో ఎక్కువ శాతం దీపాలు వెలగకపోవడంతో ఆయా కాలనీల్లో రాత్రి వేళ అంధకారం రాజ్యమేలుతోంది. సచివాలయాల్లో ఎన్ని సార్లో చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా వార్డ్ పరిధి సుందరయ్య కాలనీలో వీధి దీపాలది విచిత్రమైన పరిస్థితి. ఈ కాలనీలో వెలిగిన దీపాలు ఆరడంలేదు. కొన్ని బల్బులు వెగడంలేదు. ఈ కాలనీలో రెండు నెలలుగా సుమారు 20 స్తంభాలకు ఉన్న లైట్లు పాడై వెలగడం లేదు. బాగున్న బల్బులు మాత్రం వారం రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. వీటిని పగలు సమయంలో ఆపడం లేదు. పాడైన వాటిని బాగుచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ కాలనీలో కొన్నిచోట్ల అవసరం లేకపోయినా వీధి లైట్లు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోంది. మరికొన్నిచోట్ల అవసరమున్నా వెలగకుండా అంధకారమయంగా మారుతోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఐక్య పోరాటాలు



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్షలు 850వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ధర్నా చేశారు. ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకునేలా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సేవ్ వైజాగ్ అంటూ సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, ఇన్‌స్టా, ట్విటర్, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రయివేటీకరణ కుట్రలో భాగంగా ముడి సరుకు కోసం బీఎఫ్–3లో ఉత్పత్తి పునరుద్ధరణ కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన ప్రభుత్వ రంగ సంస్థలకు మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతోనే ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, పిట్టా రెడ్డి, డీవీ రమణ, మంత్రి శంకరనారాయణ, మసేనురావు, గొందేశి రాము, మంత్రి గోపీ, కురందాసు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, అప్పారావు, దొమ్మేటి అప్పారావు, సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- బయటకు రాని జనం
- నిర్మానుష్యంగా రోడ్లు, కూడళ్లు



ఖాళీగా దర్శనమిస్తున్న గవర్నర్ బంగళాకు వెళ్లే మార్గం



ఖాళీగా దర్శనమిస్తున్న ఏయూలోని వైఎస్ఆర్ కూడలి

ఏయూ క్యాంపస్: భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తప్పనిసరి అయితేనే బయటకు వచ్చారు. వాహనాల రాకపోకలు సైతం అంతంత మాత్రంగానే సాగాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే నగర ప్రధాన కూడళ్లు, రహదారులు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఆదివారం కూడా ఎండకు తోడు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం వేళలో రహదారులు దాదాపుగా నిర్మానుష్యంగా మారిపోయాయి. సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే రహదారులపై జన సంచారం కనిపించింది.

పోలీసులకు తప్పని అవస్థలు

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటన నేపథ్యంలో నగరం మొత్తం పోలీసు వలయంలో ఉంది. ప్రధాన కూడళ్ల వద్ద భారీగా పోలీసులను పహారాకు నియమించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వీరంతా కొంత ఇబ్బంది పడ్డారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు నీడకు వెళ్లి కాస్త సేదతీరారు.

సాగరతీరానికి జనం పరుగులు

సాయంత్రం 5 గంటల నుంచి బీచ్‌రోడ్డు జనసంద్రంగా మారింది. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి అధిక సంఖ్యలో ప్రజలు సాగరతీరానికి పరుగులు తీశారు. పర్యాటకులు, ఇతర రాష్ట్రాల వారితో పాటు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తీరంలో సేదతీరారు. ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ బీచ్ వరకు భారీగా సందర్శకులు దర్శనమిచ్చారు.

కార్మిక విభాగం కార్యదర్శిగా సత్యవతి

దాబాగార్డెన్స్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) మహిళా కార్మిక విభాగం కార్యదర్శిగా నగరంలోని పెద జాలారిపేటకు చెందిన వి. సత్యవతి నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీఎల్ పద్మ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జాలారిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మ మాట్లాడుతూ మహిళల కష్టసుఖాల్లో అండగా ఉండి, మంచి పేరు సంపాదించాలన్నారు. మత్స్యకార మహిళనైన తనను ఈ పదవిలో నియమించడం పట్ల సత్యవతి హర్షం వ్యక్తం చేస్తూ, తనకు కేటాయించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ముఖ్యంగా మహిళలకు అండగా ఉంటూ, వారికి సహకరిస్తానని పేర్కొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: రౌడీ షీటర్లు అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా జోన్ సీఐ సిహెచ్.సింహాద్రి నాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరి పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పనిచేస్తున్నది వివరాలు తెలియపరచాలని చెప్పారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కనకమాంబ అమ్మవారి పండగ ప్రారంభం



పండగ ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట శ్రీకనకమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈ నెల 13వ తేదీ జరిగే ముగింపు మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, ఉపాధ్యక్షుడు పల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొట్టా గణేష్, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ ఆవిష్కరించారు. ఆదివారం చాటింపుతో ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం తొల్లేళ్ల సంబరం నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 13న అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోశాధికారి పల్లా శివ, మువ్వల శ్రీను, జనరల్ సెక్రటరీ ప్రసాదుల అప్పారావు, కమిటీ ఆర్గనైజర్ బొట్టా లింగేష్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర సందడి



వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ

డాబాగార్డెన్స్: స్థానిక 28, 29 వార్డుల గ్రామదేవత ముత్యాలమ్మ 23వ వార్షిక జాతర ఆదివారం నౌరోజీరోడ్డు, ఊట గెడ్డ, వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఘనంగా ప్రారంభమయింది. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ పురవీధుల్లో చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సోమవారం తొల్లేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ప్రధాన పండగ జరపనున్నారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరపనున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 6, 11 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. 11.30 గంటలకు వెండి ఆభరణాలతో విశిష్ట దర్శనం కల్పించనున్నారు. భక్తులచే పసుపు కుంకుమ సమర్పించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి వంకలవీధి నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అమ్మవారి మారువారం జరపనున్నట్టు ముత్యాలమ్మ సేవా సంఘం తెలిపింది.

దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనకు స్పందన



దుస్తుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఏర్పాటుకు చేసిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్ బీఎస్సీ రెండో సంవత్సరం హోం సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఇక్కడ 40 రోజులు పాటు డ్రెస్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తర్ఫీదు పొంది తయారు చేసిన కుర్తాలు, నైటీలు, గౌన్లు, పైజమాలు, టీషర్టులు తదితర వాటిని ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆదివారం ప్రదర్శించి, విక్రయించారు. ఈ ప్రదర్శనను ఆరిలోవ సీఐ సోమశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ఇక్కడ ప్రదర్శనలో పెట్టిన వస్తువులను పరిశీలించారు. శిక్షణ పొందిన విద్యార్థినులతో మాట్లాడి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు చేతి వృత్తిలో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, శిక్షణ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమాచారమ్

అందుబాటులో ఎంప్లాయిమెంట్ అధికారులు



ఐటీఐ జంక్షన్‌లో జిల్లా ఉపాధి కార్యాలయం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సెంటర్‌లో టెక్నికల్, క్లరికల్, జిల్లా సబ్ రీజినల్(ఎస్సీ, ఎస్టీ) విభాగాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాల గురించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. జాబ్‌మేళాలు, ఎంప్లాయిమెంట్ కార్డులు, రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్‌కు సంబంధించిన సమాచారం, అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు కింద పేర్కొన్న ఫోన్ నంబర్లలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులను సంప్రదించవచ్చు.

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
సిహెచ్.సుబ్బిరెడ్డి	క్లరికల్ అధికారి	83283 75788
కె.సుధ	టెక్నికల్ అధికారి	98492 31520
ఎస్.శ్యామ్‌సుందర్	సబ్ రీజనల్ అధికారి(ఎస్సీ, ఎస్టీ)	87001 57960

ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థినులకు ఆహ్వానం



జీవీఎంసీ హైస్కూల్-జూనియర్ కళాశాల

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తెలిపారు. అత్యున్నత విద్యార్హతలు, అంకితభావం గల అధ్యాపక బృందం, వివేకంతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు బాలికలు వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా ప్రభుత్వ హాస్టల్ సదుపాయం ఉందన్నారు. అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని తెలిపారు. నువ్వే మా నమ్మకమని నమ్ముతున్న జగనన్న విద్యా దీవెన పథకం ఆశయాలకు అనుగుణంగా.. 'ఆడపిల్ల చదువు అవనికి వెలుగు' అని నిరూపిద్దామని హెచ్‌ఎం పిలుపునిచ్చారు.